మొదటి రోజు అంతంతమాత్రమే..

- మండల కేంద్రాల్లో ప్రజావాణి షురూ
- పలు చోట్ల రుణమాఫీపై రైతుల ఫిర్యాదు
- ఒక్కో చోట అధికారుల డుమ్మా
- సమాచార లోపంతో సింగిల్ డిజిట్ దాటని అర్జీలు

సిర్గాపూర్: రుణమాఫీ కాలేదని ఏవోకు వినతిపత్రం ఇస్తున్న రైతు

అందోల్: జోగిపేటలో ఫిర్యాదు చేస్తున్న దివ్యాంగుల సంఘం నాయకులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూలై 22: మండల స్థాయిలో ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కలెక్టరేట్‌లో నిర్వహించిన మాదిరిగా ప్రతి సోమవారం తహసీల్ కార్యాలయాల్లో ప్రజల దరఖాస్తులు స్వీకరించేందుకు మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే ప్రజలకు పూర్తిస్థాయిలో సమాచారం లేకపోవడంతో మొదటి రోజు అంతంతమాత్రమే దరఖాస్తులు వచ్చాయి. పలు చోట్ల అధికారులు హాజరు కాకపోవడంతో అర్జీలు ఇవ్వకుండానే పలువురు వెనుదిరిగి వెళ్లిపోయారు. పటాన్‌చెరు, రాయికోడ్‌లో మూడు చొప్పున, బొల్లారం, మునిపల్లి, నారాయణఖేడ్‌లో ఐదేసి చొప్పున దరఖాస్తులు అందాయి. వట్‌పల్లి, పుల్‌కల్, న్యాల్‌కల్ మండలాల్లో ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడంతో అధికారులు ఒంటిగంట వరకు కూర్చొని వెళ్లిపోయారు. అందోల్‌లో ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ దివ్యాంగులను కించపరిచే విధంగా మాట్లాడారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో మల్లేశం, పోచయ్య, సుభాశ్, శ్రీనివాస్‌గౌడ్ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. సిర్గాపూర్‌లో తమకు పంట రుణమాఫీ కాలేదంటూ మండలంలోని బొక్కస్‌గాం, కడ్పల్, ముబారక్ తదితర గ్రామాల రైతులు ప్రజావాణిలో గోడు వెళ్లబోసుకున్నారు. కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి, వికారాబాద్ జిల్లా బూచన్‌పల్లి గ్రామాల మధ్య రైల్వే గేట్‌ను మూసివేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పలు పార్టీల నాయకులు, రైతులు కోరారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెరువులు, కుంటలకు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లకు హద్దుఫిక్స్ చేయాలని పీఏసీఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి ఆర్సీపురం తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డిని కోరారు. మొదటి రోజు ప్రజల నుంచి స్పందన రాకపోవడం, అర్జీలు సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడంతో ప్రజా పాలనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గుమ్మడిదల: తహసీల్ కార్యాలయంలో ఖాళీగా కూర్చున్న అధికారులు

మునిపల్లి: ప్రజావాణికి అధికారులు రాకపోవడంతో బోసిపోయిన కుర్చీలు



కోహీర్: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాగిరెడ్డిపల్లి ప్రజలు

ఢీకొట్టి.. 3 కి.మీ ఈడ్చుకెళ్లి

కారు, బైకును ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి

వెంకటేశ్ మృతదేహం

మునిపల్లి, జూలై 22: వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఆల్టో కారు ఢీకొని ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తిని మూడు కిలోమీటర్ల దూరం ఈడ్చుకెళ్లిన ఘటనలో ఆవ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని కంకోల్ గ్రామ శివారులోని టోల్‌ప్లాజాల వద్ద చోటు చేసుకుంది. మునిపల్లి ఎస్సై రాజేశ్ నాయక్ వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పెద్దమండి మండలం గట్లఖానాపూర్ తండాకు చెందిన మెగావత్ వెంకటేశ్(22) కొంత కాలంగా మియాపూర్‌లో ఉంటూ ఎల్ఎల్‌బీ చదువుకుంటున్నాడు.. ఆదివారం అర్ధరాత్రి సమయంలో పని నిమిత్తం జహీరాబాద్ వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో వెనుక నుంచి వచ్చిన మారుతి ఆల్టోకారు(డ్రైవర్ శివపూర్తి రాజ్ కుమార్) వెంకటేశ్ బైక్‌ను మండలంలోని లింగంపల్లి గ్రామ శివారులోని వేవేట్ దాబా వద్ద బలంగా ఢీకొట్టింది. బైక్‌ను ఢీకొట్టడంతో వెంకటేశ్ కారు కింద పడ్డట్లు గమనించకుండా మూడు కిలోమీటర్ల మేర ఈడ్చుకుంటూ వెళ్లాడు..కంకోల్ టోల్ ప్లాజా వద్ద రాగానే టోల్‌ప్లాజా సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంకటేశ్ టోల్‌గేట్ వద్దకు రాకముందే మృతి చెందినట్లు సమాచారం. ఈ మేరకు మృతుడి తండ్రి హరిలాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బొల్లారం ఆర్వోగా నర్సింహులుకు బాధ్యతలు

బొల్లారం, జూలై 22: బొల్లారం మున్సిపాలిటీ ఆర్వోగా నర్సింహులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఘట్కేసర్ పరిధిలోని పోచారం మున్సిపాలిటీ నుంచి బదిలీపై బొల్లారం వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ ఆర్వోగా పనిచేసిన శ్రీధర్ మణికొండకు బదిలీపై వెళ్లారు. నూతన ఆర్వోకు కార్యాలయ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

పెండింగ్ నిధులు విడుదల చేయాలి

ఎంపీడీవో సుధాకార్‌కి వినతి పత్రాన్ని అందజేస్తున్న మాజీ సర్పంచ్‌లు

ఝరాసంగం, జూలై 22: గ్రామ పంచాయతీలకు పెండింగ్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మండల పరిధిలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో సుధాకార్‌కు అందజేశారు. అప్పులు తెచ్చి చేసిన అభివృద్ధి పనులకు 20 నెలల నుంచి నిధులు విడుదల చేయకపోవాడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అనంతరం ఝరాసంగం నూతన ఎస్ఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన నరేశ్‌ను పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల శాలువాతో సన్మానించారు. మిఠాయి తినిపించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొగ్గుల సంగమేశ్వర్, మాజీ టెంపుల్ చైర్మన్ నరసింహా గౌడ్, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు జగదీశ్వర్, బస్వరాజ్ పాటిల్, శ్రీనివాస్, కృష్ణ, ఫారుఖ్ పటేల్, శివరాజ్ పాటిల్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేయాలి

కోల్డ్ స్టోరేజీని నిర్మించాలని కోరుతున్న రైతులు

కోహీర్, జూలై 22: జహీరాబాద్‌లో పండిన అల్లం పంటను భద్రపరిచేందుకు కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. సోమవారం జహీరాబాద్‌లోని కిసాన్ మార్ట్‌లో విలేకరులతో పలు గ్రామాల రైతులు మాట్లాడారు. కోల్డ్ స్టోరేజీ అందుబాటులో ఉంటే మార్కెట్‌లో ధర ఉన్నప్పుడు విక్రయించే అవకాశం ఉంటుందన్నారు. కేరళ నుంచి నాసిరకం అల్లం తీసుకువచ్చి హైదరాబాద్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని, ఇక్కడి అల్లం రైతులను నష్టాల్లోకి నెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లం రైతులకు న్యాయం చేయాలని కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి దృష్టికి వెళ్లామన్నారు. దీంతో అతడు మంత్రి దామోదర రాజనర్సింహా ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పారన్నారు. మూడు నెలల వరకు నాసిరకం కేరళ అల్లం రాకుండా చూడాలని ఆదేశించారని చెప్పారు.

నిధులు లేవని చెప్పడం విడ్డూరం

మెట్రోవాటర్ వర్క్స్ ఎండీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, జూలై 22: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నూతన పైప్‌లైన్లను వేసేందుకు నిధులు కోరితే హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ ఎండీ నిధులు లేవని చేతులెత్తేయడం విడ్డూరంగా ఉందని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ విమర్శించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ 113 డివిజన్‌లోని పలు కాలనీల్లో డ్రైనేజీల నిర్మాణం, నూతన పైప్‌లైన్లు వేయడం, రోడ్ల పునరుద్ధరణ పనుల కోసం హైదరాబాద్ మెట్రో వాటర్‌వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డిని కలిసినట్లు తెలిపారు. కాలనీల్లో డ్రైనేజీలు నిర్మించాలని, తాగునీటికి పైప్‌లైన్లు వేయాలని, రోడ్ల మరమ్మతులు చేయాలని కోరినట్టు చెప్పారు. రూ.1కోటి 57 లక్షల 30వేలు కావాలని వినతిపత్రం ఇచ్చామన్నారు. ఈ వినతిపై వాటర్ వర్క్స్ బోర్డ్ ఎండీ అశోక్‌రెడ్డి తమ వద్ద నిధులు లేవని ఖరాఖండిగా చెప్పారని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని అన్ని డివిజన్లకు నిధులు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నామని చెప్పారన్నారు. గతేడాది డిసెంబర్‌లోను రూ. కోటి 11లక్షలు మంజూరు చేయాలని వినతిపత్రం ఇచ్చామని, ఎనిమిది నెలలుగా ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆరోపించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న డివిజన్లకు నిధులు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు.

గ్రామాల్లో బెల్ట్ షాపులను తొలిగించాలి

ఆబ్కారీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

సంగారెడ్డి, జూలై 22: రాష్ట్రంలో పూర్తిస్థాయిలో బెల్ట్ షాపులను నియంత్రిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రెస్‌మీట్‌లో చెప్పినా గ్రామాలు, పట్టణాల్లోని బస్తీల్లో విచ్చలవిడిగా మద్యం ఏరులై పారుతున్నదని, వెంటనే నివారించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని బైపాస్ రోడ్డులోని ఆబ్కారీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల గ్రామాలు, పట్టణాల్లోని బస్తీల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, కిరాణాషాపులు, దాబాల్లో ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా మద్యాన్ని అమ్ముతున్నారన్నారు. సంబంధిత శాఖ అధికారులు అక్రమంగా మద్యాన్ని సరఫరా చేసి బెల్ట్ షాపుల ద్వారా విక్రయిస్తున్న వైన్స్ షాపుల లైసెన్సులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి, పటాన్‌చెరు, సదాశివపేట, నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్, మునిపల్లి, కొండాపూర్ ప్రాంతాల్లో బెల్ట్ షాపులను నిర్వహిస్తున్న వ్యాపారులపై కేసులు నమోదు చేయాలని కోరారు. ధర్నాలో డీవైఎఫ్ఐ నాయకులు శివ, సాయి, ప్రశాంత్, ప్రభు, రమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

సమావేవంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి విఠల్

సంగారెడ్డి, జూలై 22: రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి విట్టల్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం కంది మండల పరిధిలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజకీయ, వ్యవసాయ తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. సమావేశంలో నాయకులు జైపాల్ రెడ్డి, విజయ్‌పాల్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, విష్ణువర్ధన్‌రెడ్డి, అంజిరెడ్డి, సంగప్ప, తోట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీ కరెంట్ లేదు.. గ్యాస్ సబ్సిడీ రాదు

- ఆరు నెలలుగా తిరుగుతున్నా పట్టించుకోరా?
- ఎంపీడీవో కార్యాలయంలో పైడిగుమ్మల్ గ్రామస్తుల ఆవేదన

ప్రజాపాలన రసీదులను చూపిస్తున్న పైడిగుమ్మల్ గ్రామస్తులు

కోహీర్, జూలై 22: ఆరు నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా తమను పట్టించుకునేవారు కరువయ్యారని పైడిగుమ్మల్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జీరో కరెంటు బిల్లు వర్తింపజేయాలని కోరుతూ సోమవారం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చారు. వారి ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో నిరాశకు లోనయ్యారు. కంప్యూటర్ ఆపరేటర్లు సైతం ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సిడీకి దూరమయ్యామని వాపోయారు. వీటితో పాటు మిగతా సంక్షేమ పథకాలకు అందుతాయో లేదోనని ఆందోళన వ్యక్తం చేశారు.

సబ్సిడీ వస్తలేదు..

ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎంతో ఆశతో ఎంపీడీవో కార్యాలయానికి వచ్చినం. మేము దరఖాస్తులు చేసుకున్నప్పుడు రశీదులు ఇచ్చింది వీళ్లే కదా. మరి మా దరఖాస్తులు ఏమైనట్లు. మా గ్రామం నుంచి 50మందికి పైగా కరెంటు బిల్లులు కడుతున్నం. గ్యాస్ సిలిండర్‌కు వెయ్యి కట్టి తీసుకుంటున్నం. కరెంటు ఫ్రీ లేదు. గ్యాస్ సిలిండర్ సబ్సిడీ లేదు.

- ఎల్లమ్మ, పైడిగుమ్మల్, కోహీర్

బిల్లులు కడుతున్నం..

ఉచిత పథకాలు ఇస్తామంటే నేను కూడా ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాను. అధికారులు కూడా నాకు రశీదు ఇచ్చింద్రు. ఫ్రీ కరెంటు కోసం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అంటే నేను కూడా సంతోషంగా ఎంపీడీవో ఫీసుకు వచ్చిన. కానీ ఇక్కడ ఉన్న కంప్యూటర్ వాళ్లు నా పేరు అసలు ఆన్‌లైన్‌లో లేదని చెప్తున్నరు. ఇప్పుడు నేను ఏం చేయాలి.

- పూలమ్మ, పైడిగుమ్మల్ కోహీర్

17,359 దరఖాస్తులు

కోహీర్ మండలంలో నిర్వహించిన ప్రజాపాలనకు 17,359దరఖాస్తులు వచ్చాయి. కరెంటు జీరో బిల్లు కోసం చాలా మంది వస్తున్నరు. గ్యాస్ సబ్సిడీ కూడా పడడం లేదని చెప్తున్నరు. కానీ వారి పేరు ఆన్‌లైన్‌లో ఉంటేనే ఏదైపా చేయగలం. ఇంత వరకు ఎడిట్ ఆప్షన్ రాలేదు.

- భారతి, ఎంపీడీవో, కోహీర్

డంపింగ్ యార్డు పనులు నిలిపివేయాలి

గుండ్లమాచునూర్ శివారులో డంపింగ్ యార్డు ఏర్పాటును అడ్డుకుంటున్న గ్రామస్తులు

హత్నూర, జూలై 22: హత్నూర మండలం గుండ్లమాచునూర్ శివారులో ఏర్పాటు చేయబోయే డంపింగ్ యార్డు పనులు వెంటనే నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి మున్సిపాలిటికి సంబంధించిన డంపింగ్ యార్డును గుండ్లమాచునూర్ శివారులో ఏర్పాటు చేయడం కోసం సిబ్బంది వెళ్లగగా విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడకు చేరుకొని పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుండ్లమాచునూర్ శివారులో ఇప్పటికే పలురకాల రసాయన పరిశ్రమల వాయు కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్న తమకు డంపింగ్ యార్డు ఏర్పాటుతో మరింత ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. గతంలో డంపింగ్ యార్డు ఏర్పాటుచేయబోతే అడ్డుకున్నామని, అప్పట్లో పనులు నిలిపివేసిన మున్సిపాలిటీ సిబ్బంది మరోసారి డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డంపింగ్ యార్డు ఏర్పాటును మానుకోవాలన్నారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రసాయన వ్యర్థాలపై ఫిర్యాదు

జిల్లెల వాగు సంపు వద్ద జేఏసీ నాయకుల ఆందోళన

జిన్నారం, జూలై 22: ఖాజీపల్లి పారిశ్రామిక వాడలో ఆదివారం రాత్రి రసాయన వ్యర్థాల విడుదలపై ఖాజీపల్లి జేఏసీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫొటోలు, వీడియోలతో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. వర్షం కురుస్తున్న సమయంలో జేఏసీ చైర్మన్ దండే రమాకాంత్ జేఏసీ ప్రతినిధులతో కలిసి పారిశ్రామికవాడలోని జిల్లెల వాగు వద్దకు వెళ్లారు. భారీగా రసాయన వ్యర్థాలు సంపులోంచి కిందికి పారుతుండడంతో ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. వెంటనే 100కు డయల్ చేయడంతో ఐడీఏ బొల్లారం పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులకు పరిస్థితిని వివరించారు. నిబంధనలు పాటించకుండా వ్యర్థాలు విడుదల చేస్తూ పర్యావరణాన్ని, ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తున్న పరిశ్రమలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. రసాయన వ్యర్థాలను నియంత్రించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మోడల్ అసోసియేషన్ ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యపై పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు.

పీచెర్యాగడిలో సినిమా షూటింగ్



షూటింగ్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

కోహీర్, జూలై 22: మండలంలోని పీచెర్యాగడి గ్రామంలో సోమవారం గ్రామాయణం సినిమా షూటింగ్ ప్రారంభించారు. సుజాత మూవీ మేకర్స్ బ్యానర్‌పై మద్రి ప్రవీణ్ డైరెక్షన్‌లో మధుసూదన్ నిర్మించే చిత్రానికి ముఖ్య నేతలు క్లాప్ కొట్టారు. గ్రామీణ ప్రజల సంప్రదాయాలు, జీవనవిధానం, కరోనా కాలంలోని స్థితిగతులు, తదితర అంశాలతో సినిమా రూపొందించనున్నారు. అజయ్ ఘోష్ ముఖ్య పాత్ర పోషిస్తుండగా హీరోగా నిఖిల్ ఒమ్మి, హీరోయిన్‌గా అశ్విని నటించనున్నారు. చిత్ర ప్రారంభంలో కో డైరెక్టర్ బండి భాస్కర్, కన్నెబోయిని లింగమూర్తి, శారద, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

రామచంద్రాపురం: కలెక్టర్ క్రాంతికి ఫిర్యాదు చేస్తున్న మాజీ సర్పంచ్ జయమ్మ

కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతి

సంగారెడ్డి, జూలై 22: రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురౌతున్న ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏకు మార్చాలని కోరుతూ ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకులు కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ముదిరాజ్ సంఘం నాయకుడు పట్నం మాణిక్యం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ పిలుపు మేరకు అన్ని కలెక్టరేట్లలో వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ముదిరాజ్‌లను ఏలోకి మార్చాలని కోరుతూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అందుబాటులో లేకపోవడంతో ఇన్‌చార్జి ఎర్రోళ్ల చిన్నకు వినతిపత్రం ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ముదిరాజ్ సంఘం నాయకులు సపానదేవ్, విఠల్, గోపన్నగారి చంద్రశేఖర్, న్యాయవాదులు మల్లేశం, పుల్లంగారి సురేందర్ ఉన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

రామచంద్రాపురం, జూలై 22: ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని మాజీ సర్పంచ్ ముత్యాల జయమ్మ కలెక్టర్ వల్లూరు క్రాంతి దృష్టికి తీసుకువెళ్లారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌ని కలిసి ఫిర్యాదు చేశారు. బండ్లగూడ గ్రామంలో శ్రీదేవి హోమ్స్ డెవలపర్స్ సంస్థ సుమారు 20గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించి అపార్ట్‌మెంట్స్ నిర్మిస్తున్నదని తెలిపారు. ఈ విషయంపై ఇటీవల రెవెన్యూ అధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. స్పందించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి రీసర్వే చేసి నివేదికను అందజేయాలని ఏడీ అధికారులను ఆదేశించారు.

నక్షత్ర తాబేలును అప్పగిస్తున్న ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి నాయకులు

నక్షత్ర తాబేలు అప్పగింత

సంగారెడ్డి, జూలై 22: అరుదైన జాతికి చెందిన నక్షత్ర తాబేలును అటవీశాఖ అధికారికి రాజు అనే యువకుడు అప్పగించాడు. సోమవారం పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన రాజు తన ఇంటి దగ్గర నక్షత్ర తాబేలు దొరికిందని సంగారెడ్డి ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్రకు సమాచారం అందించాడు. తర్వాత అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చి తాబేలును అప్పగించారు. కార్యక్రమంలో ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి ప్రధాన కార్యదర్శి అమిదిపురం మహేశ్‌కుమార్, సహ కార్యదర్శి పాండురంగం, సభ్యులు సాయి వరాల ఉన్నారు.

సురక్షిత ప్రయాణానికి 'మై ఆటో ఈజ్ సేఫ్'

జిన్నారం, జూలై 22: ప్రజలు సురక్షితంగా ప్రయాణం చేసేందుకే 'మై ఆటో ఈజ్ సేఫ్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జిన్నారం సీఐ సుధీర్‌కుమార్ అన్నారు. సోమవారం జిన్నారం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ నాగలక్ష్మితో కలిసి ఆటోలకు మై ఆటో ఈజ్ సేఫ్ స్టిక్కర్లను అంటించారు. ఆటో డ్రైవర్ల అనుచిత ప్రవర్తన, వేధింపులు లాంటి సమస్యలుంటే ఆటో డ్రైవర్ సీటు వెనుకాల ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆటో డ్రైవర్ వివరాలు వస్తాయని, వివరాలను స్క్రీన్ షాట్ చేసి పంపిస్తే సత్వరమే చర్యలు తీసుకుంటామన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

న్యాల్‌కల్/పుల్‌కల్, జూలై 22: కొత్తగా పట్టాపాసు పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని న్యాల్‌కల్ మండల వ్యవసాయ శాఖాధికారి లావణ్య, పుల్‌కల్ ఏఓ చైతన్య సోమవారం ప్రకటనలో కోరారు. గతేడాది జూన్ 28వ తేదీ వరకు భూమి కొనుగోలు చేసి ధరణి పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకున్న రైతులు బీమాకు అర్హులని పేర్కొన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన రైతులు దరఖాస్తు ఫారంతోపాటు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, నామినీ ఆధార్ కార్డ్ జిరాక్స్‌లను రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని సూచించారు. అగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. అర్హులైన రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నల్లవాగు గురుకులం ప్రిన్సిపాల్‌గా తిరుపతయ్య

సిర్గాపూర్, జూలై 22: మండలంలోని నల్లవాగు సాంఘిక సంక్షేమ గురుకులం పాఠశాల, కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా తిరుపతయ్య సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇంతకాలం ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ పాండు కొడంగల్‌కు బదిలీపై వెళ్లారు. గద్వాల జిల్లా నుంచి తిరుపతయ్య బదిలీపై నల్లవాగు గురుకులానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.

పాఠశాలల్లో ఆడిట్

జిన్నారం, జూలై 22: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2023-24కు సంబంధించి సోమవారం ఆడిట్ నిర్వహించారు. పాఠశాలల వారీగా ఆడిట్ నిర్వహించారు. ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కుమరస్వామి, అంజయ్య, ఆడిటర్ అమర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శైలజ పాల్గొన్నారు.

కుక్కలను నియంత్రించాలి

కోహీర్, జూలై 22: కోహీర్ పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న వీధి కుక్కల సంఖ్యను నియంత్రించాలని పలు కాలనీల ప్రజలు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కుక్కల బారీ నుంచి చిన్నారులను కాపాడాలని కోరారు.